
సాక్షి ఒడిశా

శనివారం । 18 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,44,548లు, బంగారం 15.4 గ్రాములు, వెండి 12.6 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

- IIలో▸



అంబరాన్నంటిన ఆత్మీయ సభ

- IIలో▸

న్యూస్‌రీల్

హస్తకళలతో స్వయం ఉపాధి



శిక్షణలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లాలో నివసిస్తున్న హిజ్రాలకు హస్తకళలపై శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి కలి ్పంచేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా పర్లాకిమిడి గజపతి స్టేడియం సమీపంలోని భవనంలో టెర్రకోట కళపై భువనేశ్వర్‌కు చెందిన కళాకారులు 2022 సెప్టెంబర్ నుంచి 6నెలలు హిజ్రాలకు శిక్షణ అందించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. హస్తకళల కళాకారులు తగ్గిపోవడంతో వారిని ప్రోత్సహించడంతోపాటు స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధి సాధించేలా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. రాష్ట్ర చేనేత, హస్తకళల విభాగం సమన్వయకర్త విశ్వజిత్ పాత్రొ, డీఏ స్ఎస్ఓ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై బాంబు దాడి కేసు

- 12కి చేరిన అరెస్టులు



పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: నగర శివారు సిద్ధార్థ విహార్‌లో గురువారం ఉదయం ఓ కేసు దర్యాప్తుపై వెళ్లిన పోలీసులపై దుండగులు బాంబులతో దాడికి దిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముందుగా ఇద్దరు మహిళలు సహా ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఈ సంఖ్య 12కి చేరింది. వారి నుంచి 2 కత్తులు, 4 బాంబులు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. దీనిపై బరంపురం ఎస్పీ సరవన్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో జరిగిన ఓ బాంబు దాడి కేసుపై దర్యాప్తులో భాగంగా పోలీసులు సిద్ధార్థ విహార్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో తప్పించుకునే ప్రయత్నంలో దుండగులు సిబ్బంది పైకి బాంబులు వేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అదనపు బలగాలకు సమాచారం అందించి, పలువురు నిందితులను అరెస్ట్ చేశారు. పరారైన వారిని వెంబడించి, పట్టుకున్నారు. దీంతో మొత్తం అరెస్టుల సంఖ్య 12కు చేరుకుంది. ఇద్దరు ఇద్దరు మహిళలు ఉన్నారని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి, బరంపురం సర్కిల్ జైల్‌కు తరలించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



సతీష్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసు స్టేషన్ పరిధి డోంగార్ అమ్మవారి ఆలయానికి సమీపంలో ఉన్న అడవిలో అనుమానాస్పదంగా యువకుడి మృతదేహం లభ్యమైంది. చెట్టుకు ఉరి వేసుకొని వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న బలిమెలకు చెందిన సతీష్(34) స్థానిక టకురాణి మందిరం సమీపంలోని ఓ ఇంట్లో నివసిస్తున్నాడు. అతని భార్య సోమవారం పుట్టింటికి వెళ్లగా.. రోజు తరహాలోనే గురువారం సాయంత్రం కొద్దిసేపు కాళీ మందిరం కూడలి వద్ద కూర్చుని, ఇంటికి వెళ్లిపోయాడు. అయితే శుక్రవారం ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. దీంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు బలిమెల పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేయగా.. ఆరోగ్యంగా తిరిగిన వ్యక్తి హఠాత్తుగా శవమై కనిపించడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్రిక్తంగా ఉద్యమం



పుకుడిబందొ జంక్షన్‌లో మొహరించిన అదనపు బలగాలు

- బరంపురంలో బలవంతంగా వాహనాలను అడ్డుకున్న ఒడిశా డ్రైవర్ మహాసంఘ్
- లాఠీచార్జికి దిగిన పోలీసులపై కర్రలతో దాడి
- ఐఐసీ సహా 10మంది సిబ్బందికి గాయాలు.. ఎంకేసీజీకి తరలింపు
- బుజ్జగింపులతో సమ్మె విరమణకు అంగీకరించిన ఆందోళనకారులు



తలకు గాయాలతో ఐఐసీ వివేకానంద మొహంతి





ఎంకేసీజీలో చికిత్స పొందుతున్న పోలీసులు



వీడియో సందేశంలో మాట్లాడుతున్న సీఎస్ ప్రదీప్ జెనా, డీజీపీ బన్సాల్

భువనేశ్వర్/బరంపురం: ఒడిశా మోటర్స్ చలక్ సంఘ్ ఆధ్వర్యంలో తమ ప్రతిపాదనలు అమలు చేయాలని డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బరంపురంలో ఉద్రిక్తంగా మారింది. నగర శివారు పుకుడిబందొ జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న డ్రైవర్లపై పోలీసులు లాఠీచార్జి చేయగా.. ఆందోళనకారులు కర్రలతో దాడికి దిగారు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనలో గొళంతరా పోలీసు స్టేషన్ ఐఐసీ సహా 10మంది పోలీసులకు తీవ్ర గాయలయ్యాయి. దీంతో ఘటనా స్థలంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న డీఐజీ సత్యబ్రత్ బొయి, గంజాం ఎస్పీ జగన్‌మోహన్ మినా, బరంపురం ఎస్పీ సరవన్ వివేక్ హుటాహుటిన అక్కడికి చేరుకొని, శాంతి భద్రతలు పర్యవేక్షించారు. గాయాలపాలైన పోలీసులకు 108 అంబులెన్స్‌లో ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

సమ్మె విరమించాలని సీఎస్ విజ్ఞప్తి..

'మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తాం. ఆందోళన విరమించి సమ్మెకి స్వస్తి పలకాల'ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా సరుకు రవాణా వాహనాల సమ్మె నిర్వహిస్తున్న డ్రైవర్ల ఏక్తా మహాసంఘ్ సభ్యులను కోరారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సునీల్‌కుమార్ బన్సాల్‌తో కలిసి శుక్రవారం సంయుక్తంగా వీడియో సందేశం జారీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మెట్రిక్ పరీక్ష, సాధారణ ప్రజలకు దైనందిన జీవనంలో తలెత్తుతున్న పలు సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆందోళనను విరమించుకోవాలని ఇరువురు ఉన్నతాధికారులు ఆందోళనకారులకు విజ్ఞప్తి చేశారు. సమ్మె ప్రభావంతో రాష్ట్రంలోని అనేక చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని గుర్తుచేశారు. మరోవైపు తమ డిమాండ్లన్నీ ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె నిరవధికంగా కొనసాగిస్తామని డ్రైవర్ల ఏక్తా(ఐక్య) మహాసంఘ్ పునరుద్ఘాటించింది. గత ఏడాదిగా ఆందోళన చేస్తున్నా.. న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. ఇకపై సహించేది లేదని, సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీ ఇస్తే తప్ప సమ్మె నుంచి వైదొలిగేది లేదని మహాసంఘ్ అధ్యక్షుడు ప్రశాంత్ మెండులి తేల్చి చెప్పారు. సమ్మెను కొనసాగించాలని కార్యవర్గం నిర్ణయించినట్లు ప్రకటించారు.



చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న ఎస్పీ సరవణ్ వివేక్

తొలుత అసంతృప్తిగానే..

డ్రైవర్ల ఏక్తా మహాసంఘం తమ డిమాండ్లను సమగ్రంగా అంగీకరిస్తూ రాష్ట్రప్రభుత్వం ప్రకటన చేసే వరకు డ్రైవర్ల ఏక్తా మహాసంఘ్ ఆందోళన నిరవధికంగా కొనసాగిస్తోందని సంఘం ప్రధాన కార్యదర్శి మెండులి తొలుత ప్రకటించారు. డిమాండ్లను 3 నెలల్లో పరిష్కరిస్తామని గురువారం సాయంత్రం సీఎస్ లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని, దీనిపై సభ్యులెవరూ సంతోషంగా లేరని విచారం వ్యక్తం చేశారు. నిరవధిక ఆందోళన సందర్భంగా శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్త వహించాలని మహాసంఘ్ సభ్యులకు విజ్ఞప్తి చేసినట్లు మెండులి తెలిపారు. వేతనాలు, సామాజిక భద్రతతో సహా తమ 10 పాయింట్ల చార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు డ్రైవర్లు బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది.

నెరవేర్చకుంటే.. ఆత్మాహుతే!

ప్రభుత్వ ఉన్నతాధికారులు రాత పూర్వకంగా హామీ ఇవ్వడంతో డ్రైవర్లు ఆందోళన విరమించినట్లు డ్రైవర్ల ఏక్తా మహాసంఘం ప్రకటించింది. వాస్తవానికి 2022 డిసెంబర్ 15నుంచి ఉద్యమానికి సిద్ధమయ్యారు. శుక్రవారంతో తాత్కాలికంగా తెరదించారు. ఈ మేరకు డ్రైవర్ల ఐక్య మహాసంఘం ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మెండులి ఓ వీడియోను విడుదల చేశారు. డ్రైవర్లు ఆందోళన విరమించాలని, 3నెలల్లో డిమాండ్లు నెరవేర్చకుంటే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి నవీన్ నివాసం ఎదుట సామూహిక ఆత్మహత్యకు సైతం వెనుకాడమని స్పష్టం చేశారు. ప్రభుత్వం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తిని గౌరవించి ఆందోళన విరమించుకున్నట్లు తెలిపారు.



ప్రశాంత్ మెండులి, డ్రైవర్ల ఏక్తా మహా సంఘం ప్రధాన కార్యదర్శి

35 మంది నిందితుల అరెస్ట్



బరంపురం పోలీసుల అదుపులో నిందితులు

ఆందోళనకారులు దాడికి పాల్పడిన ఘటనలో గొళంతరా పోలీసు స్టేషన్ ఐఐసీ అధికారి వివేకానంద మహంతి, గోపాల్‌పూర్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐలు జయచంద్ర మల్లిక్, మహేంద్ర బెహరా, హేమాంగల్ రౌళో, మరో ఆరుగురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం 35మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీరిని శుక్రవారం ఉదయం బరంపురం జిల్లా కోర్టులో హాజరు పరిచిన అనంతరం సర్కిల్ జైలుకు తరలించారు.

విజ్ఞాన పర్యటనకు గిరిజన యువత



యాత్రకు సిద్ధమవుతున్న యువత



యాత్రకు ఎంపికైన యువతతో బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ–3 గ్రామం వద్ద ఉన్న బీఎస్ఎఫ్ శిబిరం నుంచి 20మంది గిరిజన యువతీ, యువకులు విజ్ఞాన పర్యటనకు శుక్రవారం పయనమయ్యారు. వీరంతా ఈనెల 20నుంచి 26 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో, 21నుంచి 27వరకు పంజాబ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా యాత్రను రెండో బెటాలియన్ కమాండర్ ఏకే సింగ్ ప్రారంభించారు. ఇప్పటి వరకు 12 బృందాలు భోపాల్, బెంగలూర్, చండీఘర్, అహ్మదాబాద్, కొయంబత్తూర్, హైదరాబాద్, కొచిన్, హర్యాణా తదితర ప్రాంతాల్లో 304మంది పర్యటించారని తెలిపారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి బీఎస్ఎఫ్ కమాండర్ శివోం, డిప్యూటీ కమాండర్ శుభంజన్ మహాపాత్రొ, శ్రద్ధాకర్ పాఢి, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి సంతోష్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు.

21న మమతా బెనర్జీ రాక



భువనేశ్వర్: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ఈ నెలలో రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈనెల 21న సాయంత్రం భువనేశ్వర్ చేరుకొని, మరుసటి రోజు ఉదయం పూరీ జగన్నాథుని దర్శించుకోనున్నారు. 23న తిరుగు ప్రయాణమవుతారని సమాచారం. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆమె సీఎం నవన్ పట్నాయక్‌తో భేటీ అయ్యే అవకాశాల పట్ల రాజకీయ శిబిరాల్లో చర్చ ఊపందుకుంది. అయితే బిజూ జనతాదళ్(బీజేడీ) శిబిరం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం. మమత, నవీన్‌ల మధ్య ముఖాముఖి భేటీ అత్యంత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ మినహా ఇతర ప్రాంతీయ పార్టీలతో భారీ కూటమిగా బీజేపీ వ్యతిరేకంగా ఉద్యమించేందుకు మమత బెనర్జీ మొగ్గు చూపుతున్న తరుణంలో బీజేడీ అధ్యక్షుడిగా నవీన్‌తో భేటీలో ప్రాధాన్యత నెలకొంది. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మమత బెనర్జీ నవీన్‌తో భేటీకి సన్నాహాలు చేస్తున్నట్లు భావిస్తున్నారు. అంచనాల మేరకు వీరివురూ సమావేశమైతే.. రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతుంది. ఇది సార్వత్రిక ఎన్నికల్లో ఆసక్తికర మలుపు తిరుగుతుందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ జరుగుతోంది.

రాష్ట్రంలో 48,76,659 మందికి పింఛన్లు



- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి అశోక్‌చంద్ర

భువనేశ్వర్: రాష్ట్రంలోని 48,76,659 మంది లబ్ధిదారులు మధుబాబు పింఛన్, వృద్ధాప్య పింఛన్ పొందుతున్నారని రాష్ట్ర సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత శాఖామంత్రి అశోక్‌చంద్ర పండా శాసనసభలో ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 14నాటికి 12 లక్షల 402మంది యూడీఐడీ జాతీయ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 5,85,879 మంది యూడీఐడీ కార్డుల జారీ పూర్తయ్యిందన్నారు. త్వరలో మిగిలిన వారందరికీ ఈ కార్డులు జారీ చేస్తామని వివరించారు. అలాగే రాష్ట్రంలో 4లక్షల మందికి పైగా దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారని, 2011 జనాభా లెక్కలు ఈ గణాంకాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. 2021 జనాభా లెక్కలను కేంద్రప్రభుత్వం ఇంకా పూర్తి చేయలేదని గుర్తుచేశారు. ఇంతకుముందు కటక్, బుర్లా, బరంపురం మెడికల్ కాలేజీ ఆస్పత్రుల్లో మెడికల్ అసెస్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేయగా.. ఇటీవల బాలేశ్వర్, బొలంగిర్, బరిపద, కొరాపుట్, పూరీ మెడికల్ కళాశాలల్లో ఈ సౌలభ్యం కల్పించినట్లు మంత్రి సభలో ప్రకటించారు.

ఉమ్మిరిలో డాక్ మేళా



మేళాలో పాల్గొన్న సమితి అధ్యక్షురాలు, సూపరింటెండెంట్

జయపురం: సబ్ డివిజన్ లోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో సమితిలోని ఉమ్మిరి గ్రామంలో డాక్ మేళా నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు త్రిలోచన ముదులి ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ అందిస్తున్న పథకాలు, రుణాల మంజూరుపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. తపాలా డివిజన్ సీనియర్ సూపరింటెండ్ంట్ మనోజ్ ప్రగడ మాట్లాడుతూ మేళా ప్రధాన లక్ష్యాలను వివరించారు. అలాగే తపాలా కార్యాలయాలలో లభించే వస్తువులు, పథకాలపై తెలియజేశారు. ఆధార్ అనుసంధానం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలికలకు ఎంతో ఉపయోగ కరమైన సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జయపురం బీడీఓ రాజీవ్‌దాస్, ఉమ్మిరి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన డ్రైవర్లు

- తమ సంఘాన్ని అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

జయపురం: ప్రైవేటు బస్సు డ్రైవర్‌పై దాడి చేశారనే ఆరోపణపై జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను కోర్టుకు పంపారు. దీంతో ఆగ్రహించిన ప్రైవేటు డ్రైవర్లు పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. తమ సంఘాన్ని, తమను అవమాన పరచిన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై బుధవారం నుంచి ఒడిశా డ్రైవర్ మహాసంఘం ఆధ్వర్యంలో జయపురంలో ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్లు ఓ బస్సును ఆపగా, డ్రైవర్‌కు ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఇదే సమయంలో తనపై దాడి చేసిన సంబంధిత బస్సు డ్రైవర్ జయపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేయడంతో వందలాది మంది డ్రైవర్లు పోలీసు స్టేషన్ ముందు బైఠాయించారు. దీనిపై స్పందిదంచిన ఎస్‌డీపీఓ హారీష్ బీసీ ఆందోళనకారులతో చర్చించారు. రెండు ఫిర్యాదులను పరిశీలించామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పస్టంచేశారు.



పోలీసు అధికారులతో చర్చిస్తున్న డ్రైవర్ల సంఘం ప్రతినిధులు

క్లుప్తంగా

పోర్టు పనులు వేగవంతం చేయాలి: జేసీ

టెక్కలి: భావనపాడు పోర్టుకు సంబంధించి రోడ్డు, రైలు మార్గాల ప్రాథమిక పనులు వేగవంతం చేయాలని జేసీ ఎం.నవీన్‌కుమార్ ఆదేశించారు. భావనపాడు పోర్టు కోసం టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లో రోడ్డు, రైలు మార్గాల నిర్మాణానికి కేటాయించిన భూముల్లో జేసీ నవీన్‌కుమార్‌తో పాటు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు పీవీ(ప్రీ వాల్యుయేషన్) పరిశీలన చేశారు. భావనపాడు పోర్టుకు సంబంధించి రోడ్డు, రైలు మార్గాల కోసం గుర్తించిన భూముల రైతులతో మాట్లాడి పక్కాగా భూముల విలువను కట్టాలన్నారు. పోర్టు రోడ్డు కోసం టెక్కలి జాతీయ రహదారి నుంచి మోదుగువలస, బన్నువాడ, తలగాం, వేములవాడ, పాతనౌపడ, సంతబొమ్మాళి మండలంలో రాజపురం, ఇజ్జువరం, కస్పానౌపడ మీదుగా మూలపేట వరకు సుమారు 327.75 ఎకరాలను గుర్తించారు. అలాగే సంతబొమ్మాళి మండలం కోటపాడు, కాశీపురం, పోతునాయుడుపేట, యామాలపేట, కూర్మనాథపురం, రాజపురం మీదుగా రైల్వే మార్గానికి 428.02 ఎకరాల భూములను గుర్తించారు. ఈ సర్వేలో డీఐఓ ఎం.జనార్దనరావు, తహసీల్దారు కిశోర్‌తో పాటు సర్వేయర్లు ఉన్నారు.

అనుబంధ కాలేజీలకు గుర్తింపు తప్పనిసరి: వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు గుర్తింపు తప్పనిసరని విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి అనుబంధ గుర్తింపు మే నెల చివరి నాటికి పూర్తిచేయాలని అన్నారు. మొదటి ఏడాది ప్రవేశాలకు ముందు గుర్తింపు సాధించాలని వివరించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు అర్హత ఉన్న కళాశాలలకు గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు పూర్తయ్యాక మూల్యాంకనం సకాలంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ విద్యలో ఇంటర్న్‌షిప్, సామాజిక అనుసంధాన కార్యక్రమాలు తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ క్లాస్‌వర్క్ ఈ నెల 20 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

డబ్బు కోసం అడ్డదారులు..

- వివాహిత ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న యువకులు
- చాకచక్యంగా పట్టుకున్న నరసన్నపేట పోలీసులు

నరసన్నపేట: సులువుగా డబ్బులు సంపాదించాలని ఆ యువకులు అడ్డదారులు తొక్కారు. వివాహిత ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేయ డం మొదలుపెట్టారు. ఆఖరకు పోలీసుల వలలో చిక్కుకుని ఊచలు లెక్కపెడుతున్నారు. నరసన్నపేట సీఐ డి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నానుబాలవీధికి చెందిన బూసి శ్రీనివాసరావు, ఇలీసుపురం వద్ద తిలక్ నగర్‌కు చెందిన గొనప ఆకాశ్, పొందూరు మండలం కింతలికి చెందిన పైడి లోహిత్‌లు స్నేహితులు. సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలని కొందరు వివాహితల ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆ ఫొటోలు వారికి పంపించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలాకి మండలం దీర్ఘాశిలోని ఓ టీచర్ భార్య ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆ టీచర్‌కు, ఆయన భార్యకు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దీంతో ఆ టీచర్ నరసన్నపేట సీఐ రామును ఆశ్రయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి యువకులను పట్టుకోవడానికి ప్లాన్ వేశారు. వారు డిమాండ్ చేసినట్టుగానే డబ్బులు ఇస్తామని టీచర్ చేత చెప్పించి ఆ యువకులను ఈ నెల 15న నరసన్నపేటకు రప్పించారు. టీచర్ డబ్బులు ఇస్తుండగా యువకులను అక్కడే పట్టుకున్నారు. అనంతరం వారిని విచారించగా.. సులువుగా డబ్బులు సంపాదించవచ్చని ఇలా చేస్తున్నామని ఒప్పుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన సుగుణ, ముత్యాల శ్రీకాంత్‌లు ఇందులో కీలక సూత్రధారుల ని చెప్పారు. వీరిద్దరి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. పోలీసులకు దొరికిపోయిన పైడి లోహిత్, బూసి శ్రీనివాసరావు, గొనప ఆకాశ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఫోను వదులు.. ముందుకు కదులు!

కంచిలి: యువత సెల్‌ఫోన్ వాడకం తగ్గించి, ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టాలని కోరుతూ బీహార్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు హర్ష్ పండిట్ 6వేల కిలోమీటర్ల పరుగు యాత్ర మొదలుపెట్టాడు. శుక్రవారం అతను కంచిలి మండలానికి చేరుకున్నాడు. జాడుపూడి వద్ద జాతీయ రహదారిపై విలేకరులతో మాట్లాడాడు. యువతకు ఫిట్‌నెస్‌పై ప్రేరణ కలిగించేందుకు దేశంలో ఐదు మహానగరాల మధ్య 6వేల కిలోమీటర్ల పరుగు యాత్ర జనవరి ఒకటో తేదీన ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద యాత్రను ప్రారంభించా డు. ఢిల్లీ నుంచి బయలుదేరిన ఈ పరుగు యాత్ర ముంబై, చెన్నై, కోల్‌కత్తా నగరాల మీదుగా మళ్లీ ఢిల్లీ చేరుకుంటుంది. గతంలో 900 కిలోమీటర్ల పాటు పరుగు యాత్ర చేసి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో చోటు సంపాదించానని హర్ష్ పండిట్ చెప్పాడు. ఈసారి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించే లక్ష్యంతో 6వేల కిలోమీటర్ల పరుగు యాత్ర చేస్తున్నట్లు చెప్పాడు. తనతోపాటు తన తండ్రి హిమాన్షు, మిగతా బృందం ఉన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నెక్కంటి, పట్నాయక్, సంస్థ ప్రతినిధులు

రాయగడ: రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రభుత్వం తగిన ప్రాధాన్యతను కల్పిస్తోందని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. పట్టణంలోని అశోక్ మండపంలో గురువారం సాయంత్రం సంస్కృతి మహిళా సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. మిషన్‌శక్తి వంటి పథకాలు వారికి ఎంతగానో దోహద పడుతున్నాయన్నారు. వంటింటికే పరిమితమైన మహిళల్లో సామాజిక చైతన్యం రావడం ఆనందకరమని పేర్కొన్నారు. వారి జీవనోపాధి, ఆర్థిక పురోగతికి వారే బాటలు వేసుకోవడం ప్రగతికి సోపానాలని అభివర్ణించారు. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు వారి ఆర్థిక సాధికారతకు విస్తృతంగా కృషి చేస్తున్నారని, దీనికి ప్రభుత్వం కూడా చేదోడుగా ఉంటుందన్నారు. సంస్కృతి మహిళా సంస్థ ఏర్పాటై, ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించుకుంటుందంటే వారిలోని ఐకమత్యమే దీనికి నిదర్శనమని కొనియాడారు. సంస్థకు సంబంధించిన కార్యాలయం భవనం, అభివృద్ధి పనులకు తన వంతు సహకారం అందించానని గుర్తుచేశారు. భవిష్యత్‌లో కూడా మరింత తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు.

మహిళలతోనే ప్రగతి సాధ్యం..

దేశం ప్రగతి పథంలో నడవాలంటే మహిళల పాత్ర చాలా కీలకమని రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతోందని తెలిపారు. ఆయా పథకాలు వారికి చేరేలా స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందగలిగితేనే అన్ని విధాలా అభివృద్ధి సాధ్య పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

ఈ సందర్భంగా సంస్కృతి మహిళా సంస్థ అధ్యక్షురాలు సుజాత పాలో మాట్లాడుతూ.. అందరి ఆదరణ, సహకారంతోనే తమ సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్స వాలను నిర్వహించుకుంటోందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సంస్థ కార్యదర్శి సరస్వతి సాహు వార్షిక నివేదికను చదివి వినిపించారు. పలువురు ఉత్తమ విద్యార్థులు, సమాజ సేవకులకు ఘనంగా సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా సంస్కృతి పేరిట రూపొందించిన సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. అలాగే మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. స్థానిక మణిద్వీప మహిళా సంస్థకు చెందిన మహిళలు ప్రదర్శించిన నృత్యం ప్రత్యేకంగా నిలిచింది.



మణిద్వీప సంస్థ ప్రతినిధులకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న ఒడిస్సీ నృత్యం



కార్యక్రమానికి హాజరైన మహిళలు

అంబరాన్నంటిన ఆత్మీయ సభ



అభినందన సభలో పాల్గొన్న బరంపురం తెలుగు ప్రజలు



నటులు సాయికుమార్, రవిశంకర్‌ను సత్కరిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

- ప్రముఖ నటుడు సాయికుమార్‌ను సత్కరించిన తెలుగు సంఘాలు

బరంపురం: నగరంలోని గిరిమార్కెట్ రోడ్డులో ఉన్న ప్రకాశం టౌన్ హాలులో ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం, తెలుగు సాహిత్య, సంస్కృతిక సేవాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సభ సందడిగా సాగింది. తెలుగు సంఘం ప్రతినిధులు పూడిపెద్ది సత్యనారాయణ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ తెలుగు, కన్నడ చలనచిత్ర నటులు సాయికుమార్, రవిశంకర్ లను గౌరవంగా సత్కరించారు. నగరానికి చెందిన తెలుగు సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కళాకారులు, రచయితలు, రంగస్థల నటులు పాల్గొన్నారు.

మాజీలదే రాజ్యమా!

- రిటైర్డ్ ఆఫీసర్స్ క్లబ్‌గా మారిన సీఎంఓ
- ప్రతిపక్ష నేత జయనారాయణ్ మిశ్రా వ్యాఖ్యలు

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) రిటైర్డ్ ఆఫీసర్స్ క్లబ్‌గా మారిందని ప్రతిపక్ష బారతీయ జనతాపార్టీ నాయకుడు జయనారాయణ మిశ్రా వ్యాఖ్యానించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో శుక్రవారం ఈ విధంగా మాట్లాడారు. ప్రతిపక్ష నేత వ్యాఖ్యలపై అధికార బిజూ జనతాదళ్ సభ్యులు విరుచుకుపడ్డారు. ఉద్యోగ విరామం తర్వాత మాజీ ప్రభుత్వ అధికారుల పునః నియామకం పురస్కరించుకుని రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ఈ వ్యాఖ్యానం చోటు చేసుకుంది. సీఎం కార్యాలయంలో చాలామంది రిటైర్డ్ అధికారులకు పునః నియామకం(రీ అపాయింట్‌మెంట్) చేస్తున్నారని పేర్కొంటూ, సీఎంఓ రిటైర్డ్ ఆఫీసర్స్ క్లబ్‌గా, రిటైర్డ్ ఉద్యోగుల వినోద కేంద్రంగా మారిందని వేలెత్తి చూపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించలేని తరుణంలో లెక్కకు మిక్కిలిగా రిటైర్డ్ అధికారులను మళ్లీ నియమించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎందరో సమర్థత, నైపుణ్యం, విభిన్నత, సృజనాత్మకత, చురుకుదనం కూడిన ఉన్నతాధికారులు ఉద్యోగంలో కొనసాగుతుండగా.. విరామ ఉద్యోగులను నియమించడం ఖజానాపై అవాంఛిత భారం మోపుతుందని విమర్శించారు. విరమణ పొందిన వారు ప్రభుత్వం పట్ల విధేయతతో అనుకూలంగా అందుబాటులో ఉండటమే దీని వెనుక ఆంతర్యమని ఆరోపించారు. ప్రభుత్వానికి కీలుబొమ్మల్లా వ్యవహరిస్తున్న అధికారులకు పునరావాసం కల్పిస్తున్నారని మండిపడ్డారు. మిశ్రా ఆరోపణపై అధికార పక్షం సభ్యుడు డాక్టర్ అరుణ్‌కుమార్ సాహు ఘాటుగా ప్రతిస్పందించారు. ఎదుటి వారిని వేలెత్తి చూపితే మిగిలిన వేళ్లు మనల్నే చూపిస్తున్నాయని హితవు పలికారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కార్యాలయంలో ఎంతమంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను నియమించారో తెలుసుకోవాలని సూచించారు. సౌత్ బ్లాక్, ఇతర కేంద్ర కార్యాలయాల్లో మాజీలే అధికంగా ఉన్నారని, దీనిపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

శూలాయుధాలతో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దరెల్లివీధికి చెందిన పలువురు భక్తులు నూకాలమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. శూలాయుధాలతో ఊరేగింపు నిర్వహించారు. నక్కవీధి వద్ద వేంచేసిన నూకాలమ్మతల్లి ఆలయం వరకు ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో వచ్చారు. ఈ ఊరేగింపులో చిన్నారులు, పెద్దలు, యువకులు మొక్కు ల కోసం శూలాలను గుచ్చుకున్నారు. అ నంతరం అమ్మవారి ఆలయం వద్ద అగ్ని గుండం తొక్కి మొక్కులు సమర్పించుకున్నారు.

రైలు పట్టాలు పక్కన మృతదేహం



ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి ఎల్‌సీ గేట్ సమీపంలోని రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి ఒంటిపై నిక్కరు, గళ్ల టీ షర్టు ఉన్నాయి. రైలు ద్వారం వద్ద కూర్చుని కింద పడిపోయి ఉంటాడని, వయసు దాదాపు 56 ఏళ్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎల్‌సీ గేట్ మెన్ పలాస జీఆర్పీ పోలీసులకు చెప్పగా వారు 11 గంటలకు అక్కడకు వచ్చారు. అయితే పోలీసులు వచ్చే సరికి మృతదేహం లేకపోవడం గమనార్హం. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు.

పెద్దమురహరిపురంలో పిడుగుపాటు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో గురువారం రాత్రి పిడుగు పడింది. ఈ పిడుగుపాటుకు కలిశెట్టి లక్ష్మికి చెందిన ఆవు మృతి చెందింది. ఆవు దూడకు గాయాలయ్యాయి. ఆవుకు పశువుల బీమా పథకం ఉన్నందున ఆ శాఖ అధికారులు పరిశీలించి తక్షణమే ఆదుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కె.గోపాల్, సచివాలయ కన్వీనర్ జి.రామారావు కోరారు.

గొల్లూరులో..

సోంపేట: మండలంలోని గొల్లూరులో శుక్రవారం పిడుగు పడింది. దీంతో రాపాక శేషగిరికి చెందిన సూడి ఆవు చనిపోయింది. పశువైద్య సిబ్బంది ఆవును పరిశీలించి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందించడానికి కృషిచేస్తామని రైతుకు తెలిపారు.



వజ్రపుకొత్తూరు: పీఎంపురంలో మృతి చెందిన ఆవు



సోంపేట: పిడుగు పడి మృతి చెందిన ఆవుతో రైతు

పలాసలో రంగమ్మత్త



రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న అనసూయ



కాశీబుగ్గ: ప్రముఖ సినీ నటి, టీవీ యాంకర్ అనసూయ శుక్రవారం పలాస-కాశీబుగ్గలో సందడి చేశారు. ఇక్కడి కేటీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఆమెను చూసేందుకు వేలాదిగా జనం తరలిరావడంతో రోడ్డు కిక్కిరిసిపోయింది. తనకు పలాస రావాలని ఎప్పటి నుంచో ఉందని, లక్కీ షాపింగ్ మాల్ వారి వల్ల ఆ కోరిక నెరవేరిందన్నారు. మంచి ధరల్లో నాణ్యమైన వస్త్రాలు ఇక్కడ దొరుకుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని లక్కీ షాపింగ్ మాల్ ముగ్గురు డైరెక్టర్లు జి.శ్రీనివాసరావు, ఎస్.రత్తయ్య, జి.సోమయ్యలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భార్య సీదిరి శ్రీదేవి, మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం, మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, నాయకులు బోర బుజ్జి, మీసాల సురేష్‌బాబు, భవనం యాజమాన్యం కోరాడ శ్రీనివాస్, సంతోష్‌కుమార్, రవికుమార్, పివి సతీష్, మల్లా సురేష్, లొడగల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి నాటికి ఉద్దానంకు తాగునీరు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



హిరమండలం ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

హిరమండలం: ఉద్దానం తాగునీటి పథకం పనులు వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన శుక్రవారం వంశధార రిజర్వాయర్‌లో జరుగుతున్న ఉద్దానం తాగునీటి రక్షిత మంచి నీటి పథకం పనులను పరిశీలించారు. వంశధార రిజర్వాయర్‌లో నీటిని తోడేందుకు పంపు, ఫిల్టరేషన్, నీటిని తోడేందుకు యంత్రాలు, విద్యుత్ కనెక్షన్ ఇతర పనులను పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఎంత శాతం నీరు ఉంటే తాగునీరు అందివ్వగలమనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటిని విడుదల చేసే కార్యక్రమం పండగలా చేయాలన్నారు. ఎప్పటిలోగా ట్రైల్ రన్ వేసి నీటిని విడుదల చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారని సంబంధిత అధికారులను అడిగారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆశాలత మాట్లాడుతూ పాతపట్నం మండలంలో పైపులైన్ ఏర్పాటుకు ఇబ్బందులు ఉన్నాయని, అధికారుల సమన్వయ లోపమే ఇందుకు కారణమని తెలిపారు. అలాగే మందస మండలం హైవే వద్ద కూడా చిన్న సమస్య ఉందని, దాన్ని పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ఆ సమస్యలను పరిష్కరించే బాధ్యతను టెక్కలి సబ్ కలెక్టర్‌కు అప్పగిస్తానని తెలిపారు. వేసవి నాటికి నీరిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వంశధార రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. దీనికి అనుసంధానంగా ఉన్న ఎత్తిపోతల పథకం పనులు ఎంతవరకు ప్రారంభమయ్యాయో వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే జిల్లా అంతటా రెండు పంటలకు సాగునీరు అందించేందుకు వీలవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టీవీఎస్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జాన్ బెన్హర్, వంశధార డీఈ సురేష్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధనరావు, తహసీల్దార్ బి.మురళీమోహన్ రావు తదితరులు ఉన్నారు.

క్లిక్ చేస్తే.. బుక్ అయినట్టే



- కరెంటు బిల్లు పెండింగ్ ఉందంటూ సెల్‌ఫోన్లకు ఫేక్ మెసేజ్‌లు
- క్లిక్ చేసినా.. వివరాలు చెప్పినా ఖాతాలో నగదు మాయం
- జాగ్రత్తగా ఉండాలంటున్న విద్యుత్ శాఖ

అరసవల్లి: 'మీ విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది. వెంటనే చెల్లించకపోతే.. మీటర్ డిస్‌కనెక్ట్ చేస్తాం' ఇలా ఓ సందేశం మీ ఫోన్‌కు వచ్చిందా. బిల్లు కట్టేశానే.. మెసేజ్ ఎందుకు వచ్చిందనే అనుమానంతో క్లిక్ చేసి వివరాలు నమోదు చేశారో.. మీ ఖాతా ఖాళీ అయిపోతుంది. ఆ నంబర్‌కు కాల్ చేసి మాట్లాడినా.. అదే జరుగుతుంది. జిల్లాలో కరెంటు బిల్లు పేరిట తాజాగా జరుగుతున్న మోసమిది. సైబర్ నేరాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా విద్యుత్ బిల్లుల విషయంలోనూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. దీంతో జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది.

పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు



జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం ఎల్‌టీ విద్యుత్ వినియోగదారులు 9,15,848 మంది ఉండగా, హెచ్‌టీ వినియోగదారులు 473 మంది ఉన్నారు. ఈ వినియోగదారుల నుంచి నెలకు సుమారుగా రూ.85.83 కోట్లు బిల్లుల ద్వారా వసూలవుతాయి. వీటిలో సుమారు రూ.21.31 కోట్లు వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఇక హెచ్‌టీ వినియోగదారులంతా ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తుంటారు. కోవిడ్ తర్వాత ఆన్‌లైన్ చెల్లింపులు బాగా పెరిగాయి. ఈ పరిస్థితులను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అధికంగా ఎల్‌టీ విద్యుత్ వినియోగదారులనే టార్గెట్ చేసుకుని మెసేజ్‌ల రూపంలో వల వేస్తున్నారు. దీనిపై అవగాహన లేకపోవడంతో చాలామంది ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారు. పోలీసులను కూడా ఆశ్రయిస్తున్నారు. కొందరైతే విద్యుత్ శాఖాధికారులను సంప్రదిస్తున్నారు.

ఫేక్ మెసేజీలు నమ్మవద్దు



మా సంస్థ నుంచి ఏ వినియోగదారునికి నంబర్‌తో కూడిన మెసేజీలను పంపించే విధానం లేదు. బిల్లు కట్టాలని గానీ, గడువు తీరిందని గానీ, లేదంటే కనెక్షన్ కట్ చేస్తామని గానీ మా నుంచి ఎవ్వరికీ మెసేజీలు రావు. జిల్లాలో పలువురికి ఫేక్ మెసేజీలు వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ఎవరైనా ఇబ్బందులకు, మోసాలకు గురైతే ఫిర్యాదు చేయండి. సైబర్ నేరాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ మెసేజీలను నమ్మొద్దు.


– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ, విద్యుత్ సర్కిల్

దోపిడీ ఇలా..



ఓ వ్యక్తి సెల్‌కు వచ్చిన ఫేక్ మెసేజ ఇది

విద్యుత్ వినియోగదారుల ఫోన్ నంబర్లతో కూడిన సర్వీసు నంబర్లను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారు. వాటిలో అధిక వినియోగం చేసేవారిని గుర్తించి వారికి సెల్‌ఫోన్లకు మెసేజీలను పంపుతున్నారు. 'మీ బిల్లు గడువు తీరిపోయిందని, వెంటనే చెల్లించాలని, లేదంటే కనెక్షన్ కట్ చేస్తున్నామని' హెచ్చరికలతో కూడి మెసేజిలను పంపిస్తున్నారు. ఒక వేళ బిల్లు చెల్లించామని వినియోగదారుడు తిరిగి కాల్ చేసి చెప్తే వారి వివరాలతో పాటుగా యాప్‌లో అప్‌లోడ్ చేసేలా వెబ్ లింక్‌ను పంపి మోసం చేస్తున్నారు. ఆ వెబ్ లింక్ స్క్రీన్ షేరింగ్ యాప్‌కు సంబంధించినవి కావడంతో లింక్ క్లిక్ చేయగానే ఆటోమేటిక్‌గా యాప్స్ డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ అవుతాయి. వినియోగదారుని నుంచి సేకరించిన వివరాల ప్రకారం బ్యాంకు ఖాతాల్లో నగదును కొల్లగొడుతున్నారు.



తమను సంప్రదించాలంటూ నంబర్‌తో కూడిన మెసేజిని పంపిన దృశ్యం

క్లుప్తంగా

గేట్ ఫలితాల్లో విజయ్ సత్తా


గేట్‌లో 11వ ర్యాంక్ సాధించిన విజయ్

లక్కవరపుకోట: గేట్ ఫలితాల్లో మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన బొడుమూరు విజయ్ జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గురువారం ఈ ఫలితాలు విడుదలయ్యాయి. విజయ్ తండి రమణ గ్రామంలో దర్జీగా పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. తల్లి మనమ్మ గృహిణి. విజయ్ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు లక్కవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్, ఇంజినీరింగ్ విద్య నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదివాడు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(హైదరాబాద్‌లో)లో టెక్నికల్ అధికారిగా పని చేస్తున్నాడు. విజయ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల డీబార్

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస బాలుర గురుకుల కళాశాలలో ఇద్దరు ఇంటర్మీడియెట్ విద్యార్థులు శుక్రవారం డీబార్ అయినట్లు ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులు డీబారయ్యారని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సీఐ తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని ఎరుకుల వీధికి చెందిన పిరిడి శంకరరావు అనే వ్యక్తి ఆ ప్రాంతంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ విలేకర్లకు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నిందితుని నుంచి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం తరలించామన్నారు. దాడుల్లో హెచ్‌సీ మాధవి, చంద్రప్రసాద్, జయరామ్, సరస్వతి తదితరులు పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

ఒకరి మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఎం.లింగాలవలసలో కడుపునొప్పి తాళలేక మంత్రి కృష్ణమూర్తి మృతి చెందినట్టు పెదమానాపురం ఎస్ఐ బి.భాగ్యం శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. కృష్ణమూర్తి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఇంటికి రాకపోవడంతో ఎదురు చూస్తున్న సమయంలో సాయంత్రం ఇంటి వెనుక పడి ఉండడం గమనించిన కుటుంబ సభ్యులు సపర్యలు చేయగా ఉలుకు, పలుకు లేకపోవడంతో వెంటనే 108లో గజపతినగరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో వైద్యం పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య గౌరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మంత్రి గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అకాల వర్షంతో అరటికి నష్టం


బొడ్డవర ప్రాంతంలో పాడైన అరటితోట

శృంగవరపుకోట: అకాల వర్షంతో అరటి రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులకు పలు గ్రామాల్లో అరటి తోటలు, మొక్కజొన్న చేలు నేలకొరిగాయి. పంట చేతికొచ్చే సమయంలో పాడవ్వడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

దుర్గమ్మా.. చల్లంగ చూడమ్మా..


కోటదుర్గతల్లి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న దంపతులు

తల్లీ జగన్మాతా.. నమోనమామి... మమ్మల్ని చల్లంగచూడమ్మా.... ఆది పరాశక్తి ఆదుకోవమ్మా అన్న శరణుఘోషతో వీరఘట్టం మారుమోగింది. కోటదుర్గమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ పునఃప్రారంభోత్సవంలో భాగంగా యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండవరోజు దుర్గమ్మకు 250 మంది దంపతులు కుంకుమ పూజలు జరిపారు. సహస్ర నామార్చనలు, నారికేళాభిషేకాలతో గోపుర శిఖరంలో అలంకరించబోయే కళశానికి అభిషేకాలు చేశారు.

– వీరఘట్టం

'తల్లీబిడ్డ' సురక్షితం



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 38 వాహనాలు
- ఇప్పటి వరకు 10 వేల మందికి సేవలు
- పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఇంటికి చేర్చుతున్న వైనం

సంతోషంగా ఉంది



నాకు పురిటినొప్పులు రాగానే 108లో ఆస్పత్రికి చేర్చారు. ఘోషాస్పత్రిలో ప్రసవించిన తర్వాత తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఉచితంగా ఇంటికి చేర్చారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ప్రసవం జరగడంతో పాటు ఎటువంటి రవాణ చార్జీలు లేకుండా ఇంటికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది. – కె.కామయ్యమ్మ, జక్కువ గ్రామం, మెంటాడ మండలం


బిడ్డతో ఇంటికి వెళ్తున్న మహిళ

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు గర్భిణులు, బాలింతల పాలిట వరంగా మారాయి. పురిటి నొప్పులు రాగానే సమాచారం వచ్చిందంటే చాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్చి ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా, హ్యాపీగా ఇంటికి చేర్చుతున్నారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సురక్షితంగా ఇంటికి...

జిల్లాలో 22 వాహనాల ద్వారా తల్లీబిడ్డలను ఇంటికి చేర్చుతున్నాం. ఆస్పత్రిలో డిశ్చార్జ్ అయిందని సమాచారం వచ్చిన వెంటనే వారిని స్వగ్రామాలకు చేర్చుతున్నాం. ఉచితంగా ఇంటికి వెళ్లడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– రవి, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కో – ఆర్డినేటర్

విజయనగరం ఫోర్ట్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. గర్భిణులను ఆస్పత్రికి ప్రసవం కోసం చేర్చడానికి 108 అంబులెన్సులను ప్రవేశపెట్టింది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలను ఇంటికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్సుల ద్వారా ఉచితంగా చేర్చుతున్నారు. గర్భిణులను ఆస్పత్రికి ఉచితంగా తీసుకువెళ్లడంతో పాటు ప్రసవం అనంతరం ఇంటికి కూడా ఉచితంగా ఈ వాహనం ద్వారా ప్రభుత్వమే చేర్చుతుంది.

విజయనగరం జిల్లాలో 22 వాహనాలు

తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి ఉచితంగా చేర్చుతుండడంతో ప్రసవించిన ప్రతి ఒక్కరు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. ఏసీ సౌకర్యంతో కూడిన వాహనం కావడంతో తల్లీబిడ్డ ఇద్దరికి సౌకర్యవంతంగా ఉంటుంది. గతంలో ఒకే వాహనంలో ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులను వాహనాల్లో ఇంటికి చేర్చేవారు. ప్రస్తుతం ఒకే వాహనంలో ఒక తల్లీబిడ్డను మాత్రమే ఇంటికి చేర్చుతున్నారు. జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 22 ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ఇంత వరకు 6వేల మంది వరకు తల్లీబిడ్డలను ఇంటికి చేర్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 16 ఉన్నాయి. ఇంతవరకు నాలుగు వేల మంది వరకు ఇంటికి చేర్చారు.

యాప్‌లో గర్భిణుల వివరాలు

గర్భిణులు కాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లిన నాటి నుంచి డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం యాప్‌లో నమోదు చేస్తారు. తల్లుల రక్షణ, భద్రతకు భరోసా కల్పిస్తూ వాహనాలకు జీపీఎస్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తూ వాహనం ఎక్కడ ఉందో కూడా అధికారులు రియల్ టైంలో తెలుసుకునేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు టోల్‌ఫ్రీ నంబరు 102 కేటాయించారు.

జిల్లాకు కేటాయించిన వాహనాల వివరాలు

ఘోషాస్పత్రికి 9 వాహనాలు, పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి 4 వాహనాలు, సాలూరు సీహెచ్‌సీకి 2, చీపురుపల్లికి 2, బొబ్బిలి సీహెచ్‌సీకి 2, గజపతినగరం సీహెచ్‌సీ, నెల్లిమర్ల సీహెచ్‌సీ, బాడంగి సీహెచ్‌సీ, గురునాయుడుపేట పీహెచ్‌సీ, కురుపాం సీహెచ్‌సీ, భద్రగిరి సీహెచ్‌సీ, రామభద్రపురం పీహెచ్‌సీ, బందలుప్పి పీహెచ్‌సీ, మక్కువ పీహెచ్‌సీ, ఎస్.కోట సీహెచ్‌సీ, ఎల్.కోట పీహెచ్‌సీ, డెంకాడ పీహెచ్‌సీ, మొండెంఖల్లు పీహెచ్‌సీ, భోగాపురం సీహెచ్‌సీలకు ఒకొక్కటి చొప్పున కేటాయించారు.

ఫిష్ ఆంధ్రా -ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీ

- జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

పార్వతీపురం: ఫిష్ ఆంధ్రా – ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీని మంజూరు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ ఏజెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిష్ ఆంధ్రా లబ్ధిదారుల ఎంపిక, షాపు ఎంపిక, డీసీసీబీ బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. జనరల్ కేటగిరీలో 40శాతం సబ్సిడీ మహిళలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో 60శాతం సబ్సిడీని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. శ్రీనిధి ఫండ్స్ ద్వారా డీఆర్‌డీఏ ఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా 39శాతం సబ్సిడీ అందజేస్తామన్నారు. మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్స్ యూనిట్‌కి లక్ష నుండి 3లక్షల వరకు ఉండగా లబ్ధిదారుల వాటా 10శాతం చెల్లించాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా రుణ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. రూ.10లక్షలు, రూ.20లక్షల కోబ్రాండింగ్, డీఎఫ్ఎఫ్, ఫిష్ ఆంధ్రా డైలీ డెలీషియస్ సూపర్, ఫిష్ కియోస్క్, లైవ్‌ఫిష్ వెండింగ్ సెంటర్ యూనిట్స్‌కు 40నుండి 60శాతం వరకు సబ్సిడీ, రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఔత్సాహిక నిరుద్యోగ యువకులు ఎస్‌హెచ్‌డీ, ఎస్‌జీఓలు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మత్స్య శాఖ జిల్లా అధికారి 9701463640ను సంప్రదించాలన్నారు. పాలకొండ/భద్రగిరి మత్స్య శాఖాధికారి 9441279251ను, పార్వతీపురం/ సాలూరు ఎఫ్‌డీఓ 8309206895, స్థానిక సచివాలయం గ్రామ మత్స్యసహాయకులను సంప్రదించాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి, టీపీఎంయూ అదనపు పథక సంచాలకులు వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్షి ప్రేమికులు

వేసవిలో పక్షులు, మూగజీవాలు, మొక్కలకు నీరు, ఆహారాన్ని అందిస్తూ కొందరు ఉపాధ్యాయులు తమ సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. నలుగురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రెడ్డి రాజగోపాలరావు, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కె.విజయగౌరి, కృష్ణాపురానికి చెందిన శ్రీచైతన్య యువజన సేవా సంఘం అధ్యక్షుడు చుక్క శ్రీనివాసరావు, మెట్టవలసకు చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కాజా వేణుగోపాలరావు, ఉపాధ్యాయుడు కె.కృష్ణదాస్ పక్షులకు చెట్లపై బాటిళ్లతో నీరు నింపుతూ వాటి దాహార్తిని, ఆహారం పెడుతూ ఆకలిని తీర్చుతున్నారు. మొక్కలను సంరక్షిస్తూ కాపాడుతున్నారు. ఇదే సమయంలో వీటి సంరక్షణ అవసరాన్ని ప్రచారం చేస్తూ నలుగురిని ఆలోచింపజేస్తున్నారు. – బొబ్బిలి రూరల్


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పక్షులకు చలివేంద్రం సిద్ధం చేసిన ఉపాధ్యాయులు



వేసవిలో పక్షుల కోసం ఆహారం అందించేందుకు కృష్ణాపురంలో శ్రీనివాసరావు ఏర్పాటు చేస్తున్న ట్రేలు


చెట్టుపై పక్షుల కోసం ట్రే ఏర్పాటు చేస్తున్న కృష్ణదాస్


మెట్టవలసలో పక్షులకు నీటిని ఏర్పాటు చేస్తున్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కాజా వేణుగోపాలరావు


పక్షుల కోసం ఆహారం అందించే పరికరం ఏర్పాటు చేస్తున్న అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజగోపాలనాయుడు

జేఎన్‌టీయూలో ప్రారంభమైన సింపోజియం


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య

విజయనగరం టౌన్: జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటూ నిర్వహిస్తున్న నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇటువంటి సింపోజియంలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతీ విద్యార్థి మల్టీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమలో ఉన్న నాలెడ్జ్‌ను అభివృద్ధి పరుచుకోవాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జెవిఆర్.మూర్తి మాట్లాడుతూ ప్రపంచమంతా భారతీయ యువత వైపే చూస్తోందన్నారు. అందుకనుగుణంగా ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి తమ అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో కొత్త అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ సిహెచ్.హిమబిందు, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు కె.వెంకటరమణ, ఎస్.ప్రమీల, ప్రొఫెసర్లు బాబులు, రాజ్యలక్ష్మి, జయసుమ, జి.అప్పలనాయుడు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ఆరా..


విక్రంపురం సబ్ సెంటర్‌లో గర్భిణులకు మాత్రలు వేయిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

కొమరాడ: గ్రామాల్లోని గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని విక్రంపురం గ్రామ సబ్ సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీ వార్మింగ్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రెండు, మూడు త్రైమాసికంగా ఉన్న గర్భిణులకు వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రం వేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో గర్భిణులకు ఈ మాత్రలు వేయించారు. పీహెచ్ఎస్ విజయగౌరి, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30 ఎకరాల్లో కొండపోడు పంటలు దగ్ధం

- కాలిపోయిన జీడి, పసుపు, పైనాపిల్ మొక్కలు
- గిరిజనులకు భారీ నష్టం


బొర్రవలస కొండల్లో కాలిన పంటలను పరిశీలిస్తున్న కిండంగి సచివాలయ సిబ్బంది

సీతంపేట: కొండపోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల పంటలు దగ్ధమయ్యాయి. దీంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కోడిశ, శంబాం పంచాయతీ పరిధి బొర్రవలస కొండ వద్ద జరిగిన అగ్ని ప్రమాదం వలన సుదూర ప్రాంతంలో ఉన్న ఆడలి, బొక్కుడుగూడ, బొర్రవలస గ్రామాలకు చెందిన రైతుల పంటలు కూడా కాలిపోయాయి. బుధవారం మధ్యాహ్నం రాజుకున్న మంటలను ఆపడం ఎవ్వరితరం కాలేదని గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో మంటలు ఆగాయని గిరిజనులు తెలిపారు. కొండపోడు పంటలైన జీడి, మామిడితో పాటు అంతర్ పంటలైన పసుపు, పైనాపిల్, అల్లం, కొండచీపుర్లు పూర్తిగా బుగ్గిపాలయ్యాయని గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. బొర్రవలసకు చెందిన ఓ రైతు తన పొలంలో తుప్పలు కాల్చేసి అగ్గి ఆపకుండా వెళ్లడంతో ఇలా జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కిండంగి గ్రామ సచివాలయ సిబ్బంది వీఆర్ఓ మహేష్, గ్రామ కార్యదర్శి రవీంద్ర, వీఆర్ఏ సూర్యనారాయణ, మహిళా పోలీస్ అరుణ వెళ్లి పరిశీలించారు. నివేదికను తహసీల్దార్‌కు సమర్పించామన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్


గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరంఫూల్‌బాగ్/గుర్ల: గుర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం తనిఖీచేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 25,274 మంది విద్యార్థులు హాజరుకాగా, 1780 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారు.

తాటిచెట్టుపై పిడుగు


పిడుగుపాటుకు తాటిచెట్టుపై మంటలు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామ పరిధి ఏఎమ్‌సీ గొడౌన్‌కు సమీపంలో తాటిచెట్టుపై శుక్రవారం పిడుగు పడింది. దీనిని చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

19న మహిళల సీనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

విజయనగరం: జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే ఏపీ సీనియర్స్ మహిళా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 19న గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 కిలోల లోపు బరువు కలిగిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆ రోజు రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జిల్లాకు చేరిన ఎంసీహెచ్ కార్డులు

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల వివరాలు నమోదు చేసే ఎంసీహెచ్ (మదర్ చైల్డ్ హెల్త్) కార్డులు 26 వేలు జిల్లాకు శుక్రవారం చేరాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని స్టోర్‌లో వీటిని భద్రపరిచారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలకు సరఫరా చేస్తారు. ఎంసీహెచ్ కార్డులో గర్భిణుల వైద్య తనిఖీ వివరాలు నమోదు చేస్తారు. ఏ నెలలో ఏ టీకా వేయాలన్న వివరాలు ఉంటాయి.

మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదీ..


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ శ్రీరాములనాయుడు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం తన కార్యాలయం ఆవరణలో పట్టణంలో మొక్కల సంరక్షణ బాధ్యతలు చూస్తున్న సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో కీలకమన్నారు. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం కార్యక్రమం కింద నగరంలో అనేక మొక్కలను నాటినట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో మొక్కల సంరక్షణ బాధ్యతను సమీప స్థానికులకు అప్పగించినట్లు తెలిపారు. వేసవిలో మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని, ప్రతీ మొక్కనూ సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. మొక్కలకు నీరు అందించేందుకు 2 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం పాలాస్పత్రిలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం అయ్యారు. ఆస్తి పన్నుతో చెత్తపన్ను అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు.